

హాజరుకావాల్సిందే
ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. 8లో▸



సేవలోనే సంతృప్తి
సేవలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని స్ట్రీట్ కాజ్ వీజేఐటీ స్వచ్ఛంద సంస్థ డివిజన్ అధ్యక్షుడు నేహాల్ అన్నారు. 8లో▸



చలికాలం.. జీవాలు భద్రం!
చలి తీవ్రత పెరుగుతుండటంతో పశువులు, జీవాలకు పలు రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. 9లో▸

న్యూస్‌రీల్

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించాలి

తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



తేమ శాతాన్ని కొలిచే పరికరాన్ని పరిశీలిస్తున్న ఉమాశంకర్ ప్రసాద్

కొడంగల్ రూరల్: రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. సోమవారం మండలంలోని అప్పాయిపల్లి, పెద్దనందిగామ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలు సుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ నిర్మాణానికి స్థలం అప్పగింత

కొడంగల్ రూరల్: డీసీసీబీ నిర్మాణం కోసం పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ పాత భవన స్థలాన్ని సోమవారం రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను బ్యాంక్ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈఓ పురుషోత్తంరావు దేశ్‌పాండేకు అందజేశారు. ప్రస్తుతం డీసీసీబీ అద్దె భవనంలో కొనసాగుతోందని, ఆర్‌డబ్ల్యూస్ శాఖ స్థలాన్ని అధికారులు అందజేయడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంతు కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిరవధిక నిరాహారదీక్ష

అనంతగిరి: పెంచిన పెన్షన్ మొత్తాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళ, బుధవారాల్లో కొడంగల్‌లో నిరవధిక నిరాహారదీక్షలు చేపట్టనున్నట్లు దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి కావలి నర్సింలు, జిల్లా అధ్యక్షుడు పోతురాజు సురేష్ తెలిపారు. సోమవారం వికారాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మాట ఇచ్చి ఏడాది అయినా ఇప్పటికీ పింఛన్ పెంపును అమలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే పెన్షన్ మొత్తం పెంచి ప్రతి నెలా ఒకటో తేదీ ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

10న భగవద్గీత కంఠస్థ పోటీలు

అనంతగిరి: టీటీడీ – హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 10న భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గూడూర్ హరినాథ్ తెలిపారు. సోమవారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆవిష్కరించారు. పోటీలు వెంకటేశ్వస్వామి ఆలయంలో జరుగుతాయని తెలిపారు. 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులు 6వ అధ్యాయంలోని 15 శ్లోకాలు నేర్చుకుని రావాలని సూచించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా పాఠశాల నిర్వాహకులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో చండీశ్వర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యుఘోష

ఉమ్మడి జిల్లాలో ఒకేరోజు ఆరు ఘటనలు
- ఒక హత్య.. ఐదు రోడ్డు ప్రమాదాలు
- తమ్ముడి చేతిలో అక్క హతం
- వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మంది దుర్మరణం
- మరో 11 మందికి తీవ్ర గాయాలు
- ఉలిక్కిపడిన ఉమ్మడి జిల్లావాసులు



ప్రమాద స్థలంలో రోదిస్తున్న మృతుల బంధువులు







1. శ్యామల సుజాత
2. నక్కలపల్లి రాములు
3. దామరగిద్ద కృష్ణ
(మృతుల ఫైల్ ఫొటోలు)

సాక్షి, రంగారెడ్డిజిల్లా/చేవెళ్ల: ఒకే రోజు ఉమ్మడి జిల్లాలో ఆరు వరుస ఘటనలు ఉలికిపాటుకు గురిచేశాయి. ఒక హత్య.. ఐదు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఆయా ఘటనల్లో మొత్తం తొమ్మిది మంది మృతి చెందగా, మరో పది మంది తీవ్ర గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. సోమవారం ఉదయం విధినిర్వహణలో భాగంగా రాయపోలు నుంచి హయత్‌నగర్ ఠాణాకు వెళ్తున్న మహిళా కానిస్టేబుల్ కొంగర నాగమణి(28)ని స్వయంగా ఆమె సోదరుడు హత్య చేశాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఓఆర్‌ఆర్‌పై (కోహెడ–పెద్ద అంబర్‌పేట్ మార్గ మధ్యలో) అకస్మాత్తుగా ఆగిన ఓ లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టిన ఘటనలో మనోజ్ అనే యువకుడు అతని సోదరి పద్మ మృత్యు వాతపడ్డారు. ఈ ఘటనలో మృతుని బావ సహా ఇద్దరు కోడళ్లు, అల్లుడు తీవ్ర గాయాలపాలయ్యారు. సాయంత్రం చేవెళ్ల మండలం ఆలూరుస్టేజీ వద్ద కూరగాయల వ్యాపారులపైకి లారీ దూసుకెళ్లిన ఘటనలో నలుగురు మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు. కాసేపటికి చేవెళ్ల–వికారాబాద్ సరిహద్దు ప్రాంతంలోని అంగడిచిట్టింపల్లి గేటు వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎంను స్కూటీపై వెళ్తున్న వ్యక్తి ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. పరిగి మండలం నజీరాబాద్‌తండా సమీపంలో కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. వికారాబాద్ పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు.



సహాయక చర్యల్లో పోలీసులు, స్థానికులు

ఆర్తనాదాలు.. హాహాకారాలు

చేవెళ్ల/మొయినాబాద్: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై చేవెళ్ల మండలం ఆలూరు గేటు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీరని విషాదాన్ని మిగిల్చింది. ఘటనా స్థలం గాయపడ్డవారి ఆర్తనాదాలు, హాహాకారాలతో నిండిపోయింది. రోజు మాదిరిగానే పొలాల్లో పండించిన కూరగాయలను విక్రయించేందుకు ఆలూరు గేటు వద్దకు వచ్చిన వారికి ఇవే ఆఖరి రోజులని గుర్తించలేకపోయారు. ఎప్పటిలానే కూరగాయలు అమ్ముకుని తిరిగి ఇంటికి వస్తారని ఎదురుచూసిన కుటుంబ సభ్యులు తమ వారి మరణవార్తను జీర్ణించుకోలేకపోయారు. ఈ ప్రమాదం ఎనిమిది కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. మృత్యు రూపంలో దూసుకొచ్చిన లారీ నలుగురిని బలితీసుకోగా ఐదుగురిని గాయాలపాలు చేసింది. ఈ ప్రమాదంలో నాంచేరి గ్రామానికి చెందిన బాలమణి రెండు కాళ్లు విరిగాయి. ఆలూరు గ్రామానికి చెందిన రేణుక, ఆకుల పద్మమ్మకు గాయాలు కాగా కూరగాయలు కొనేందుకు వచ్చిన ఫాంహౌస్‌లో పనిచేసే చల్లా మాల్యాద్రి గాయపడ్డారు. లారీ డ్రైవర్ రెండు కాళ్లు ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, ఏసీపీ రమణగౌడ్, పలు పార్టీలకు చెందిన నాయకులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

భయానకంగా ప్రమాదస్థలి
ఆలూరు గేటు వద్ద జరిగిన ప్రమాదం భయానకంగా మారింది. ప్రమాద సమయంలో పెద్ద సంఖ్యలో కూరగాయలు విక్రయించే వారు, కొనేవారు ఉన్నారు. ఒక్కసారి దూసుకొచ్చిన లారీ కొంత మంది పైనుంచి దూసుకెళ్లి చెట్టును ఢీకొనడంతో చెట్టు విరిగి కింద పడింది. అక్కడే ఉన్నవారంతా భయంతో పరుగులు తీశారు. కూరగాయలు చెల్లాచెదురుగా పడిపోయాయి. భీతావహ పరిస్థితి చూసి ఒక దశలో మృతుల సంఖ్య పది మందికి పైగా ఉంటుందన్న ప్రచారం జరిగింది.



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

రెండు గ్రామాల్లో విషాదఛాయలు
ప్రమాదంలో ఆలూరు, నాంచేరి గ్రామాలకు చెందినవారు మృతి చెందడంతో రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతులంతా పేదకుటుంబాలకు చెందిన రైతులు కావడం విశేషం. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున తరలివచ్చి మృతదేహాలను చూసి బోరున విలపించారు. నాంచేరికి చెందిన శ్యామల సుజాత కొడుకు, కుటుంబ సభ్యుల రోదనలు అందరినీ కలిచివేశాయి.

స్థానికుల ఆందోళన
హైదరాబాద్–బీజాపూర్ రహదారి విస్తరణ కాకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు పోతున్నా పట్టించుకునేవారు లేరని స్థానికులు ఆందోళనకు దిగారు. రెండు రోజుల్లో రెండు కిలోమీటర్ల పరిధిలో ఈరోడ్డుపై ఆరుగురు మృతిచెందారని, ఇంకా ఎన్ని ప్రాణాలు కోల్పోతే స్పందిస్తారని మండిపడ్డారు. పోలీసులు వారిని సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

భారీగా స్తంభించిన ట్రాఫిక్
ఆలూరు గేటు వద్ద ప్రమాదంతో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేయడానికి గంటల సమయం పట్టింది. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ పోలీస్‌స్టేషన్లకు చెందిన సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

పావుగంటలో ఇంటికి చేరతారనగా ..

- ఓఆర్‌ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
- అక్కాతమ్ముడిని కబళించిన మృత్యువు
- మరో నలుగురికి తీవ్ర గాయాలు



లారీ కింద ఇరుక్కుపోయిన కారు

అబ్దుల్లాపూర్‌మెట్ : మరో 15 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనుకున్న అక్కా తమ్ముడిని మృత్యువు కబళించింది. ఓఆర్‌ఆర్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయిపల్లె గ్రామానికి చెందిన ఎరగదిండ్ల మనోజ్ (25) అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని కుంట్లూర్‌కు చెందిన తన అక్క చల్లా పద్మ (31), బావ వెంకటేశ్, మేన కోడళ్లు గంగ, యమున, మేనల్లుడు చల్లా అర్జున్‌ను తీసుకుని సోమవారం ఉదయం వనపర్తి నుంచి కారులో కుంట్లూర్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో ఔటర్ రింగ్‌రోడ్డుపై కోహెడ –పెద్దఅంబర్‌పేట మార్గంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారుకు ముందు అతి వేగంగా వెళ్తున్న లారీని డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో కారులో ప్రయాణిస్తున్న మనోజ్ తేరుకునేలోపే లారీని వెనుకవైపు నుంచి బలంగా ఢీకొట్టాడు. లారీలో కారు ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో మనోజ్‌తో పాటు పద్మ అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా వారికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

కారును ఢీకొట్టి.. బైక్‌పైకి దూసుకెళ్లి

- మద్యం లోడ్‌తో వెళ్తున్న బొలెరో బోల్తా
- ఇద్దరు వ్యక్తుల దుర్మరణం

అనంతగిరి: వికారాబాద్ పట్టణం రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో సోమవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వికారాబాద్ నుంచి మద్యం లోడ్‌తో కోట్‌పల్లికి వెళ్తున్న బొలెరో గూడ్స్ వాహనం ఎడమవైపు నుంచి రోడ్డుపైకి వస్తున్న కారును ఢీకొని ఎదురుగా వస్తున్న బైక్‌పైకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌నగర్‌కు చెందిన రవీందర్(45) స్థానిక ప్రభుత్వ మెడికల్ ఆస్పత్రిలో ప్రైవేటు వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన హేమంత్(25) అనంతగిరిగుట్టపై నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరూ ఒకే చోట పని చేస్తున్న వీరు రాత్రి బైక్‌పై రాజీవ్‌నగర్ వైపు నుంచి వికారాబాద్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో మద్యం లోడ్‌తో వెళ్తున్న బొలెరో గూడ్స్ వెహికల్ కారును ఢీకొని. వీరి బైక్‌పై పడింది. దీంతో టూ వీలర్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కొద్ది సేపటికే మృతిచెందారు. రవీందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా.. హేమంత్‌కు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరి మృతితో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వికారాబాద్ పోలీసులు తెలిపారు.



బోల్తా పడిన బొలెరో గూడ్స్ వెహికల్, చెల్లాచెదురుగా పడిన మద్యం బాక్స్‌లు





రవీందర్, హేమంత్ (ఫైల్ ఫొటోలు)

ఎదురెదురుగా స్కూటీ, డీసీఎం ఢీ

వ్యక్తికి తీవ్ర గాయాలు

చేవెళ్ల: హైదరాబాద్– బీజాపూర్ రహదారిపై సోమవారం అంగడి చిట్టెంపల్లి బస్ స్టేజీ వద్ద మరో ప్రమాదం చోటు చేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న స్కూటీ, డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో స్కూటీపై వెళ్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. యూపీ రాష్ట్రానికి చెందిన రాజు అనే వ్యక్తి చేవెళ్ల మండలం అంతారం సమీపంలోని ఆర్గాన్ విల్లాస్‌లో పని చేస్తున్నాడు. వ్యక్తిగత పని నిమిత్తం చేవెళ్ల వెళ్లిన ఆయన తిరిగి వస్తుండగా అంగడి చిట్టెంపల్లి గేటు వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నగరానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



అంగడి చిట్టెంపల్లి బస్టేజీ వద్ద ప్రమాదానికి గురైన స్కూటీ, డీసీఎం

కారు, బైక్ ఢీ

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

పరిగి: కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన బీజాపూర్ జాతీయ రహదారిపై నజీరాబాద్‌తండా సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. పట్టణానికి చెందిన వాజిద్ రంగాపూర్ నుంచి పరిగి వైపు ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో పరిగి నుంచి రంగాపూర్ వైపు వెళ్తున్న కారును న్యామత్‌నగర్ వైపు టర్న్ తీసుకుంటుండగా బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాజిద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలించినట్లు సమాచారం.



గాయపడిన వాజిద్

రాయపోల్‌లో విషాదం

ఇబ్రహీంపట్నం: మహిళా కానిస్టేబుల్ హత్యతో రాయపోల్‌లో విషాదం నెలకొంది. ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని కులాంతర వివాహం చేసుకుందనే కారణంతో.. ఓ యువకుడు సొంత అక్కను నరికి చంపాడనే వార్త దావాణలంలా వ్యాపించింది. గ్రామంలో ఎక్కడ చూసినా ఇదే చర్చ సాగింది. మహిళా కానిస్టేబుల్ హత్య దారుణమని సీపీఎం జిల్లా నాయకులు సామేల్, బుగ్గ రాములు, మల్లేశ్, బీఎస్పీ నాయకురాలు శాంత ఆవేదన వ్యక్తం చేశారు. నాగమణిని హత్య చేసిన ఆమె సోదరుడు పరమేశ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మృతురాలి బంధువులు, సీపీఎం నేతలు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు.





ఇబ్రహీంపట్నం ఠాణా ఎదుట బంధువులు, నేతల ఆందోళన (ఇన్‌సెట్) శ్రీకాంత్, నాగమణి దంపతులు

రుధిర దారి



- రక్తమోడుతున్న బీజాపూర్ హైవే
- మూడేళ్లలో 146 మంది మృత్యువాత
- క్షతగాత్రులుగా మిగిలిన 400 మంది
- అయినా చలించని ప్రభుత్వాలు
- నేటికీ ప్రారంభం కాని రోడ్డు విస్తరణ పనులు
- మొన్న మీర్జగూడగేటు వద్ద దంపతుల మృతి
- తాజాగా ఆలూరు స్టేజీ వద్ద జరిగిన ప్రమాదంలో నలుగురు దుర్మరణం, మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బీజాపూర్ రహదారిపై రక్తపు టేరులు పారుతున్నాయి. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం వెలుగు చూస్తూనే ఉంది. ఎందరో ప్రాణాలు కోల్పోతుండగా.. మరెందరో క్షతగాత్రులుగా మిగులుతున్నారు. అయినా పాలకుల్లో చలనం కలగడం లేదు. ప్రమాదాలను నియంత్రించే చర్యలు చేపట్టడం లేదు. రెండు రోజుల క్రితం మీర్జాగూడ గేటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పొద్దుటూరుకు చెందిన లక్ష్మారెడ్డి, భాగ్యమ్మ దంపతులు మృతి చెందగా, తాజాగా చేవెళ్ల సమీపంలోని ఆలూరు స్టేజీ వద్ద రోడ్డు వెంట కూరగాయలు అమ్ముకుంటున్న వారి పైకి లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.

మలుపులు.. మృత్యుకుహరాలు
జిల్లాలో ఇటు అప్పా జంక్షన్ (తెలంగాణ పోలీసు అకాడమీ) నుంచి అటు మన్నెగూడ వరకు (46 కిలోమీటర్లు) జాతీయ రహదారిపై మొత్తం 66 మలుపులున్నాయి. వీటిలో 19 ప్రమాదకరంగా మారాయి. మూడేళ్ల వ్యవధిలోనే 379 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా, 146 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 400 మంది క్షతగాత్రులయ్యారు. అయినా ప్రభుత్వాల్లో కదలిక రావడం లేదు. ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు ఈ రోడ్డు విస్తరణ అంశాన్ని ప్రచారాస్త్రంగా మలుచుకుంటున్నాయి. తీరా గెలుపొందిన తర్వాత విస్మరిస్తున్నాయి.

బీజాపూర్ రోడ్డుపై ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	క్షతగాత్రులు	మృతులు
2022	172	170	47
2023	101	102	55
2024	106	107	44

రెండేళ్ల క్రితమే శంకుస్థాపన
హైదరాబాద్ నుంచి బీజాపూర్ వెళ్లే రోడ్డు మార్గం అత్యంత ఇరుగ్గా, నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డుపై రోజుకు కనీసం 30 వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రమాదాల నివారణ కోసం ఆరేళ్ల క్రితమే నాలుగు లేన్లుగా విస్తరించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రూ.928.41 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. మొత్తం 266.55 హెక్టార్ల భూమి అవసరమని గుర్తించింది. ప్రభుత్వ భూమి 69.25 హెక్టార్లు కాగా, ప్రైవేటు వ్యక్తుల నుంచి 154.50 హెక్టార్లు సేకరించాల్సి ఉంది. ఇందుకు రూ.156.80 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. దారి పొడవునా 18 అండర్‌పాసులు, మొయినాబాద్ సమీపంలో 4.35 కిలోమీటర్లు, చేవెళ్ల సమీపంలో 6.36 కిలోమీటర్ల రెండు బైపాస్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. అప్పా నుంచి మన్నెగూడ వరకు (46 కిలోమీటర్లు) విస్తరించతలపెట్టిన ఈ రోడ్డు పనులకు 29 ఏప్రిల్ 2022లో అప్పటి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరి శంకుస్థాపన చేశారు. టెండర్ ఖరారైనా ఇప్పటికీ పనులు మొదలు కాలేదు.

గ్రీన్ ట్రిబ్యూనల్‌లో కేసులు
రోడ్డుకు ఇరువైపులా పురాతన, ఎత్తయిన మర్రి చెట్లు ఉండడంతో రోడ్డు విస్తరణలో భాగంగా వాటిని తొలగించాల్సి వచ్చింది. చెట్ల పరిరక్షణ పేరుతో బన్యన్ ట్రీ అనే స్వచ్ఛంద సంస్థ నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించింది. దీంతో తాత్కాలికంగా రోడ్డు పనులకు బ్రేక్ పడింది. చెట్లను రీలొకేట్ చేసి, కేసును ఎత్తివేయించే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సహా వికారాబాద్ ఎమ్మెల్యే, ప్రస్తుత స్పీకర్ గడ్డం ప్రసాద్ సైతం తరచూ ఇదే రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. అయినా వారు చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

చేవెళ్ల పీఎస్‌లో ఫిర్యాదు
రోజుకో ప్రమాదంతో ప్రజల ప్రాణాలు తీస్తున్న బీజాపూర్ రహదారి విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలని బీఆర్‌ఎస్ స్పోక్ పర్సన్ పి.కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం సోమవారం చేవెళ్ల ఆర్డీఓకు విజ్ఞప్తి చేసింది. అనంతరం ప్రభుత్వంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రోడ్డు ప్రమాదాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీజాపూర్ హైవేపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

క్లుప్తంగా

బంగ్లా దాడులకు నిరసనగా రేపు ర్యాలీ



మాట్లాడుతున్న హిందూ ఐక్య వేదిక ప్రతినిధులు

అనంతగిరి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఈనెల 4న బుధవారం వికారాబాద్‌లో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు హిందూ ఐక్య వేదిక ప్రతినిధులు తెలిపారు. సోమవారం వికారాబాద్‌లోని శ్రీ రామ మందిరంలో ముఖ్య ప్రతినిధులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందువుల ఐక్యతను ప్రపంచానికి తెలియజేయాలన్నారు. బంగ్లాదేశ్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అక్కడ హిందువుల రక్షణను సాధించాలని తెలిపారు. ర్యాలీకి హిందు బంధువులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ర్యాలీ కొత్తగంజ్ హనుమాన్ మందిరం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు డాక్టర్ సత్యనారాయణగౌడ్, యాదవరెడ్డి, సురేష్‌శర్మ, టి.రాజు, చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, ముత్తారెడ్డి, సదానంద్‌రెడ్డి, జయదేవ్, డాక్టర్ రాజశేఖర్, మోహన్‌రెడ్డి, నవీన్‌కుమార్, ఆత్మలింగం, డాక్టర్ భక్తవత్సలం, నరోత్తంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, విజయ్‌కుమార్, యాదగిరి, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

డీఎంహెచ్‌ఓకు ఆశవర్కర్ల వినతి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య

అనంతగిరి: తమ సమస్యలు పరిష్కరించాలని డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట, సీఐటీయూ, బీఆర్‌ఎస్ అనుబంధ సంఘాలకు చెందిన ఆశవర్కర్లు వేరువేరుగా నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్‌లను నెరవేర్చాలని కోరారు. పెండింగ్ వేతనాలు, బిల్లులను విడుదల చేయాలన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ వెంకటరవణకు వేరు వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, సీఐటీయూ ఉపాధ్యక్షుడు రామకృష్ణ పలువురు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాకేశ్



ధర్నాలో పాల్గొన్న రాకేశ్ తదితరులు

కేశంపేట: పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాకేశ్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాకేశ్ మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. బడ్జెట్‌లో 25 శాతం నిధులు విద్యకు, వైద్యానికి 25 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. భూమి లేని పేదలకు ఎకరా సాగు భూమి కేటాయించి నీటి వసతి కల్పించాలని కోరారు. పేద, మధ్య తరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, మండల ఇన్‌చార్జి రమేష్, మండల కన్వీనర్ మహిపాల్, జిల్లా మీడియా ఇన్‌చార్జి నరేష్, శివ, రవి, ఆనంద్, రమేష్‌గౌడ్, విష్ణు, కృష్ణ, శ్రీకాంత్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి హాజరుకావాల్సిందే

- అధికారులకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశాలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. ప్రజలు ఇచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పెన్షన్లు, భూ సమస్యలపై 128 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష

ప్రజావాణి అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు, ఎంచుకున్న లక్ష్యాలను పూర్తి చేయడంపై అధికారులతో చర్చించారు. అనుమతి లేకుండా గురుకులాలు, స్కూళ్లు, కళాశాల్లోకి ఎవ్వరినీ పంపరాదని ఆదేశించారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాల డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయడంలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వరాదని తెలిపారు. సీఎం కప్ పోటీలను ఈ నెల 7 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామ పంచాయతీ స్థాయిలో, 10 నుంచి 12వ తేదీ వరకు మండల స్థాయిలో, 16 నుంచి 21వ తేదీ వరకు జిల్లా స్థాయిలో క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, ఆర్డీఓ వాసుచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో స్కాలర్‌షిప్‌లు అందాలి

విద్యార్థులకు సకాలంలో స్కాలర్‌షిప్ అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ విద్యార్థులకు అందించే పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌పై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల అధికారులతో కలిసి జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకునే క్రమంలో వస్తున్న సమస్యలను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి సర్టిఫికెట్‌లో ఉన్న వివరాలు ఆధార్ కార్డులో ఉండేలా అవగాహన కల్పించాలని అన్నారు. విద్యార్థుల గ్యాప్ సర్టిఫికెట్ నిమిత్తం కళాశాల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలు డీఎస్సీడీవోకు విద్యార్థుల జాబితాలను సమర్పించాలని తెలి పారు. నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పాస్ పోర్టల్ స్కాలర్ షిప్ నిమిత్తం రిజిస్టర్ చేసుకున్నట్లయితే స్కాలర్ షిప్ త్వరలో మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి మల్లేశం, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొడంగల్ నర్సింగ్ కళాశాల ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అనంతగిరిగుట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి వీక్షించిన కలెక్టర్, నర్సింగ్ కళాశాల విద్యార్థులు

అనంతగిరి: వికారాబాద్ జిల్లా కొడంగల్ నర్సింగ్ కళాశాలను సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి వర్చువల్ పద్ధతిన ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు జిల్లా అధికారులు అనంతగిరిగుట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి కొడంగల్ నర్సింగ్ కళాశాల, మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రతీక్‌జైన్ జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొడంగల్ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటరవణ, కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



వీక్షిస్తున్న కలెక్టర్ తదితరులు



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి

ప్రతిపక్షాలకు విమర్శించే హక్కు లేదు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి

బంట్వారం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్, బీజేపీలు ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేవన్నారు. గ్యారంటీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీతో వికారాబాద్ జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బంట్వారంలో మేకల సంత ఏర్పాటుతో పాటు తొర్మామిడిలో రైతు గోదాం నిర్మాణానికి సంబంధించి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రొసీడింగ్ కాపీ అందజేశారన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. త్వరలోనే మేకల సంతతో పాటు రూ.1.45 కోట్లతో రైతు గోదాం నిర్మిస్తామన్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ప్రసాద్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేషం, వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు హరీశ్వర్‌రెడ్డి, మొగులయ్య, ఏఎంసీ డైరెక్టర్లు యాదగిరి, నర్సింలు, నాయకులు మున్నాభాయి, అజీం, గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, బర్కత్‌పల్లి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

మోమిన్‌పేట: గ్రంథాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మోమిన్‌పేటలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నిరుద్యోగులు గ్రంథాలయాల్లో చదువుకొని ఉద్యోగాలు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. అలాంటి వాటికి పూర్వ వైభవం తెస్తామని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఇక్కడి పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని తెలిపారు. పాఠకులు, నిరుద్యోగ యువతకు కావాల్సిన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్ గౌడ్, మండల అధ్యక్షుడు శంకర్, వార్డు మాజీ సభ్యుడు ఎరాజ్ పాల్గొన్నారు.

పురుగులు వస్తే ఏజెన్సీ రద్దు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

- కరన్‌కోట్ ఉన్నత పాఠశాలలో మధ్యహ్న భోజనం పరిశీలన



కరన్‌కోట్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తే సంబంధిత ఏజెన్సీని రద్దు చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజా పాలన దినోత్సవాల్లో భాగంగా సోమవారం కరన్‌కోట్‌లో పర్యటించారు. ఉన్నత పాఠశాలలో రూ.40 లక్షలతో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అన్నం, కూరల్లో పురుగులు వస్తే ఏజెన్సీలను దర్దు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పదో తరగతికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఎదైనా సమస్యల వస్తే నేరుగా ఫోన్ చేయాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. పాఠశాలలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు నేటికీ రాలేదని ఎస్ఎంసీ చైర్మన్ ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, ఎంఈఓ వెంకటయ్య పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం బాగలేవు

కరన్‌కోట్ గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు పలు సమస్యలను విన్నవించారు. గ్రామానికి సరఫరా అయ్యే రేషన్ బియ్యం బాగాలేవని వాటిని ఎట్లా తినాలని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులతో మాట్లాడి మంచి బియ్యాన్ని సరఫరా చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు.

గ్రామానికి వచ్చి ఎంపిక చేస్తా

ప్రతి గ్రామానికి వచ్చి అర్హులైన పేదలను ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక చేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రజా పాలన దినోత్సవంలో భాగంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లగా ఒక్కరికి కూడా ఇళ్లు ఇవ్వలేదన్నారు. తాండూరు నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి బీసీలకు రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు ఇస్తామన్నారు. త్వరలో తెల్లరేషన్‌కార్డులు కూడా అందజేస్తామన్నారు. పీఆర్ విభాగం నుంచి తాండూరు ప్రాంతానికి రూ.400 కోట్లతో బీటీ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, రైతులకు రుణమాఫీ, 200 యూనిట్ల వరకు కరెంట్ ఉచితంగా ఇస్తున్నామని చెప్పారు. ఆర్థిక పరిస్థితి కుదుటపడ్డాక మహిళలకు నెలకు రూ.2,500 కూడా ఇస్తామని భరోసా ఇచ్చారు. రెండేళ్లలో తాండూరు ప్రాంతం రూపురేఖలు మారుస్తానని పేర్కొన్నారు. కరన్‌కోట్ గ్రామంలో రౌడీరాజ్యం నడవదని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగప్ప, నాయకులు ఉత్తమ్ చందు, శరణు బసప్ప, రాజ్‌కుమార్, జర్నప్ప, హర్షవర్ధన్‌రెడ్డి, అనిల్, విజయ్, వెంకటయ్య, రాంచంద్రారెడ్డి, మల్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, రాందాస్, రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మరో నలుగురి లొంగుబాటు

- లగచర్ల కేసులో 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన న్యాయమూర్తి

దుద్యాల్: లగచర్ల ఘటన కేసులో నిందితులుగా ఉన్న నలుగురు వ్యక్తులు సోమవారం కొడంగల్ కోర్టులో లొంగిపోయారు. దీంతో రాంచర్, ఎన్. హన్మంతు, లోకేష్‌నాయ్, కుమ్మరి శివకుమార్‌కు.. న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం నలుగురినీ పరిగి జైలుకు తరలించారు. ఈ కేసులో ఇప్పటికే 29 మంది రిమాండ్ ఖైదీలుగా ఉండగా.. వీరితో కలిపి అరెస్టయిన వారి సంఖ్య 33కు చేరింది.

పోలీసు కస్టడీకి ఏ– 2 సురేశ్

కొడంగల్: లగచర్లలో అధికారులపై జరిగిన దాడి కేసులో ఏ–2 నిందితుడిగా ఉన్న బోగమోని సురేశ్‌ను రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇస్తూ సోమవారం కొడంగల్ కోర్టు అనుమతి ఇచ్చింది. ఇదే కేసులో ఏ–1గా ఉన్న మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డితో పాటు ఏ–2 సురేశ్‌ను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఇరుపక్షాల వాదనలు వినిపించారు. ఏ–2 నిందితుడు సురేశ్‌ను రెండు రోజుల పాటు కస్టడీకి ఇవ్వగా, ఏ–1 కస్టడీ పిటిషన్ తీర్పును 6వ తేదీకి వాయిదా వేశారు.

తీర్పులు వాయిదా..

అనంతగిరి: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై సోమవారం వికారాబాద్ జిల్లా కోర్టులో వాదనలు జరిగాయి. ఈ తీర్పును న్యాయస్థానం 5వ తేదీకి వాయిదా వేసింది. ఇదే కేసులో నిందితులుగా ఉన్న రైతులు వేసిన బెయిల్ పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును మంగళవారానికి వాయిదా వేసింది.

యువకుడి అదృశ్యం



మహ్మద్ ఇమ్రాన్ ఖాన్(ఫైల్)

పహాడీషరీఫ్: యువకుడు అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ తెలిపిన ప్రకారం.. న్యూబాబానగర్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్ ఖాన్(28) స్క్రాప్ ప్యాకింగ్ చేస్తుంటాడు. నవంబర్ 24న సాయంత్రం 5.30 గంటలకు ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా అతని ఆచూకీ లభించలేదు. అతని తల్లి జాహెదా నాజ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు, ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో గాని 87126 62366 నంబర్‌లో గాని సమాచారం అందించాలని కోరారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

సేవలోనే సంతృప్తి

- స్ట్రీట్ కాజ్ వీజేఐటీ స్వచ్ఛంద సంస్థ డివిజన్ అధ్యక్షుడు నేహాల్

అనంతగిరి: సేవలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని స్ట్రీట్ కాజ్ వీజేఐటీ స్వచ్ఛంద సంస్థ డివిజన్ అధ్యక్షుడు ఆకుల నేహాల్, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ పూజిత అన్నారు. సోమవారం వారు వికారాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు అన్ని విధాలుగా తర్ఫీదునిచ్చేందుకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించామన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం వాటర్ ఫిల్టర్‌లు ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటామని తెలిపారు. పదోతరగతి పూర్తి చేసిన అనంతరం వారికున్న అవకాశాలు.. చేయాల్సిన కోర్సులు తదితర అంశాలను వివివరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పూజిత, భూమిక, అబ్దుల్లా, వీక్షణ, సోఫియా, విష్ణు, అన్విత్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రీకొడుకుల గంజాయి దందా

విశాఖ టు నిజామాబాద్

- నిషేధిత సరుకు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- 62 కిలోల గంజాయి, ఆటో, సెల్‌ఫోన్, రూ.10 వేల నగదు సీజ్
- కేసు వివరాలు వెల్లడించిన మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

మహేశ్వరం: ఆటోలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి చెప్పారు. సోమవారం ఆమె మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామానికి చెందిన మహ్మద్ మౌలానా ఆటో డ్రైవర్. ఇతను విశాఖపట్నం జిల్లా చింతపల్లికి చెందిన చిట్టిబాబు నుంచి ఆటోలో గంజాయి తీసుకొచ్చేవాడు. దీన్ని నిజామాబాద్ జిల్లా ధరమాబాద్(మహారాష్ట్ర బోర్డర్)కు చెందిన ప్రాణహిత అనే మహిళకు అధిక ధరకు విక్రయించి లాభం పొందేవాడు. నవంబర్ 30న శనివారం సాయంత్రం మౌలానా తన కుమారుడు మహ్మద్ ముస్తాఫాతో కలిసి తుని సమీపంలోని తాళ్లపాలెం వద్ద చిట్టిబాబు నుంచి 62.428 కిలోల(30 ప్యాకెట్లు) గంజాయిని రూ.2.10 లక్షలకు కొనుగోలు చేశారు. ఆటోలో వెనుక భాగంలో ప్రత్యేకంగా తయారు చేయించిన ఫ్రేమ్‌లో గంజాయి ప్యాకెట్లు లోడ్ చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. రెగ్యులర్ రూట్‌లో వెళ్తే పోలీసు తనిఖీలుంటాయని మిర్యాలగూడ, దేవరకొండ, కల్వకుర్తి, మహేశ్వరం గేటు నుంచి శ్రీశైలం జాతీయ రహదారి, ఓఆర్‌ఆర్ మీదుగా నిజామాబాద్ వెళ్లాలనుకున్నారు. ఈ నెల 1న మధ్యాహ్నం 12గంటల సమయంలో కల్వకుర్తి నుంచి మహేశ్వరం గేటు వైపు ఆటోలో గంజాయి తరలిస్తున్న క్రమంలో పోలీసులకు అనుమానం వచ్చి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆటోలో తరలిస్తున్న 62.428 కిలోల గంజాయి(30 పాకెట్లు), టాటా ఏస్ ఆటో, మొబైల్ ఫోన్, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకుని మహ్మద్ మౌలానా, మహ్మద్ ముస్తాఫాలను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. నిందితులను పట్టుకున్న పోలీసులను డీసీపీ అభినందించారు. ఈ సమావేశంలో మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మధుసూదన్, క్రైమ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణకు కృషి చేయాలి

షాబాద్: కుష్టు వ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని షాబాద్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం సందర్భంగా మండల కేంద్రలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. కుష్టువ్యాధి పురాతనమైనదని, పురాతన నాగరికతల సాహిత్యంతో వివరించబండిదన్నారు. తొలి దశలో చికిత్స చేయడం ద్వారా కుష్టువ్యాధిని నివారించవచ్చన్నారు. శారీరక వైకల్యంతో పాటు, కుష్టువ్యాధి బారిన పడిన వ్యక్తులు వివక్షను ఎదుర్కొంటారని చెప్పారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో కుష్టువ్యాధిని నివారించేందుకు కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. డిసెంబర్ 2 నుంచి 15 వరకు మండంలోని అన్ని గ్రామాల్లో తమ సిబ్బంది సర్వే నిర్వహించి కుష్టువ్యాధి రోగులను గుర్తిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మేరినా, లక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది తదితరులున్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్లు సీజ్

యాచారం: నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్న ఆరు టిప్పర్లను ఆదివారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం చౌదర్‌పల్లి గ్రామంలోని ఓ వ్యవసాయ పొలం నుంచి నగరానికి అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు టిప్పర్లను పట్టుకుని అనంతరం యాచారం తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు.